# పెళ్ళికాని

## హావిస్

"ఇంతకన్నా దిక్కుమాలిన సంబంధము దొరకలేదుటయ్యా?" గసురుకుంటున్నది పార్వతమ్మ.

ఆఫీసులో చాలా అవసరమైన కుర్రతనపు తగాదాలో యిరుక్కుని మనసు పాడుచేసుకుని చిరాగ్గా యింటికి వొచ్చిన కుటుంబరావుకి ఆ మాటలు కించిత్ నవ్వు తెప్పించాయి. ఆయన లోపలికి రావడం చూసి అప్పటిదాకా ముఖం వాచేట్లు పార్వతమ్మ చేతిలో చివాట్లు తిన్న గంగాధరశాస్త్రి లేచి నిలబడ్డాడు. "నమస్కారం పంతులుగారూ" అంటూ కుటుంబరావు తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో ఆ నమస్కారము స్వీకరించి "యిప్పుడే వొస్తాను" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు. బట్టలు విప్పుకుంటూండగా పైటహాల్లో నుంచి పార్వతమ్మ మాటలు అతనికి మళ్ళా వినిపించాయి.

"బంగారంలాంటి పిల్ల. లక్షణంగా పి. యు సి. చదువుకుంటోంది! దాని ఖర్మకాలి ఆ యింట్లో పడటమా?" అంటున్నదామె.

"అది కాదమ్మగారూ! శర్మగారు బాబుగారి స్నేహితులు గదాని చెప్పాను మీకు యిష్టం లేకపోతే..." వినయంగా సమాధానం చెప్పాడు శాస్త్రి.

"చాల్లే! పెళ్ళి కాకపోతే పిల్ల యింట్లోనే ఉంటుంది. తీరని కాయ బరువా?" అన్నారు.

ఆ మాటతో కుటుంబరావుకి మరింత నవ్వొచ్చింది. సావిత్రి కాలేజిలో చేరిన నాటినుంచీ దానికోసం పెళ్ళిసంబంధాలు వెతుకుతూనే ఉంది పార్వతమ్మ. ఆలాగని కూతురు చదువు యెడల ఆమెకేమీ వైముఖ్యంగాని వైషమ్యంగాని లేదు. ఏ వయసులో జరగవలసిన ముచ్చట ఆ వయసులో జరిగిపోవాలనీ సమయం మించిపోతే

తరువాత చాలా చిక్కులు రావొచ్చనీ ఆమె వాదిస్తున్నది. కుటుంబరావు నవ్వుతూనే "ఏం? అదెవడినన్నా మోహించి లేచిపోతుందని భయమా?" అంటే పార్వతమ్మ రోషకషాయిత నేత్రాలతో విరుచుకుపడ్డది "అది నా బిడ్డ. అట్లాంటి తప్పుడు ఊహాలు దానికి కలలోకూడా రావు" అన్నది. 'కలల సంగతి నీకెట్లా తెలుసూ? అని అడగా లనిపించేది కుటుంబరావుకి కలల విషయమై తనకున్న అభిప్రాయాలు వివరించటం అప్రస్తుతంగా భావించి ఊరుకునేవాడు. పార్వతమ్మ వీర పాతివ్రత్య ప్రచారకురాలు కలలోనైనా పరపురుషుడ్ని గురించి తల్చుకోవటం ఆమె దృష్టిలో మహాపరాధం.

బట్టలు మార్చుకున్న కుటుంబరావు, హాల్లోకి వొచ్చాడు లేవబోతున్న గంగాధరశాస్త్రిని కూచోమని "ఎవరి సంబంధమండి శాస్త్రులుగారూ?" అని అడిగాడు. గంగాధరశాస్త్రి చెప్పాడు. తుర్లపాటి వేంకటాచలశర్మగారి పెద్దబ్బాయి—అదేదో పత్రికలో ఉద్యోగం చేస్తూ లక్షణంగా నెలకి రెండు వందలు తెచ్చుకుంటున్నాడు బుద్ధిమంతుడు. అందగాడు - అతని సంగతి. ఆ శర్మ కుటుంబరావుకి ఆబాల్య స్నేహితుడు అతని కొడుకు సంగతి అనంగానే "అప్పుడే వాడి కొడుకు అంతటివాడు ఐనాడా?" అన్నాడు కుటుంబరావు అనక్తితో గంగాధరశాస్త్రి ధైర్యం పుంజుకుని "వారి రెండో అబ్బాయి ఇంజనీరింగ్ చదువుతున్నాడండి. పెద్దమ్మాయికీ, ఈ అబ్బాయికీ యీ ఏడు పెళ్ళి చెయ్యాలనుకుంటున్నారాయన" అన్నాడు.

పార్వతమ్మ రుసరులాడుతూ లోపలికి వెళ్ళిపోయింది

"ట్నం ఎంత కావాలిట వాడికి?" అన్నాడు కటుంబరావు, నవ్వుతూ.

"అమ్మమ్మా! వారిదగ్గిర ఆమాటే తలవటానికి వీల్లేదండి! మాట వరసన అడిగితే మా అబ్బాయిని అమ్ముకోమంటావుటయ్యా? అన్నారండి."

"మరి అమ్మాయికో?


"కట్నం అడిగేవాడ్ని చేసుకోనని అమ్మాయిగారు ఖరాఖండిగా చెప్పేశారండి."

కటుంబరావు నవ్వి ఆలోచనగా "మొత్తంమీద పిల్లల్ని తనలాగానే తయారు చేశాడన్నమాట?" అన్నాడు.

గంగాధరశాస్త్రి కంగారుపడి నీళ్లు నమిలి "మీ అభిప్రాయం అర్థం కాలేదు" అన్నాడు.

కుటుంబరావు అతనివంక చూసి అతని కంగారు అర్థం చేసుకుని పకపక నవ్వేశాడు.

గంగాధరశాస్త్రి తెల్ల మొహం వేశాడు.



కుటుంబరావు నవ్వుతూ ఉండగానే వీధిలోనుంచి సావిత్రీ ఆమె అన్న రాజూ చేతుల్లో పుస్తకాలతో ఇంట్లోకి వొచ్చారు. సావిత్రి తండ్రి నవ్వు చూసి "ఏవిఁటి నాన్నా?" అన్నది. కుటుంబరావు నవ్వు ఆపి "ఇవాళ యింత ఆలస్యమైందేవఁమ్మా?" అన్నాడు. సావిత్రి తండ్రి పక్కకి వొచ్చికూర్చుని "కాలేజీలో యివాళ సైన్స్ ఆర్ట్స్ ఎసోసియేషన్ ఎన్నికలు నాన్నా! అన్నయ్య సెక్రటరీగా ఎన్నికైనాడు'' అన్నది.

''ఏరా?" అన్నాడు కుటుంబరావు.

బిడియంగా తలవూపాడు రాజు.

"ఎన్నిక కాగానే సరికాదు. అందుకు న్యాయం చెయ్యాలి. చిత్తశుద్ధితో పనిచెయ్యాలి. తెలిసిందా?"

తల వూపాడు రాజు.

"వెళ్ళండి."

ఇద్దరూ లోపలికి వెళ్ళిపోయారు.

ఆ తర్వాత కాసేపు కుటుంబరావునీ ఆయన పిల్లల్నీ పొగిడిపారేశాడు గంగాధరశాస్త్రి. కుటుంబరావుకి అదేమీ పట్టలేదు అతని మనసులో తన చిన్ననాటి స్నేహితుడూ, అతని కొడుకూ నివాసం ఏర్పరుచుకోసాగారు. ఆ కుటుంబాన్ని అతను చూసి ఏడేనిమిదేళ్ళౌతుందేమో! ఒకసారి తీరిక చేసుకుని వెళ్ళి చూసిరావాలి. వియ్యం విషయం ఆయన అంతగా

పట్టించుకోలేదు. పెళ్ళి జరగడం తన యిష్టంమాత్రమే కాదుగదా? సావిత్రి యిష్టపడాలి; పార్వతమ్మ ఔననాలి! ఆ రెండోది జరగదు. ఎందుకు జరగదో తనకు తెలుసు.

మరో ఐదు నిముషాలు కూచుని గంగాధరశాస్త్రి వెళ్ళిపోయాడు. కుటుంబరావు వంటింట్లోకి వొచ్చాడు. పొయ్యిమీద ఎసరుపెడుతున్న పార్వతమ్మ మొగుణ్ణి చూసి "ఏం చెప్పి పంపించారు?" అన్నది. కుటుంబరావు ఆ ప్రశ్నకి సమాధానం చెప్పకుండా పీట వాల్చుకుని కూచున్నాడు.

"మీ రేవన్నా చెప్పండి; ఈ సంబంధం నాకిష్టంలేదు" అన్నది పార్వతమ్మ.

"పొట్లాడదామని సరదాగా ఉందా పార్వతీ?" అన్నాడాయన.

"నాకేం అట్లాంటి సరదాలులేవు."

"మరెందు కట్లా మాట్లాడతావు? శర్మ నా చిన్ననాటి స్నేహితుడు. అతన్ని గురించీ, అతని కుటుంబాన్ని గురించీ తూస్కారంగా మాట్లాడటం నీకు తగిన పనేనా?"

"ఇందులో నేను తూస్కారంగా మాట్లాడిం దేవుంది?"

"మనస్ఫూర్తిగా ఆ మాట అంటున్నావా?"


"దొంగమాటలు మా యింటా వంటాలేవు!...ఐనా కట్నం వొద్దంటున్నాడని మీకు మోజుగా ఉందేమో? లాంఛనాలంటూ అఘోరిస్తాయి. అవెట్లాగూ తప్పవు. మీకు లాభించేదేమీ ఉండదు."

"చాలా తెలివిగా ఆలోచిస్తున్నావు!"

"నా తెలివి ఏవుందిలెండి?"

కుటుంబరావుకి చిరాకు వేసింది. పాతిక సంవత్సరాలనుంచీ కాపురం చేస్తున్నా పార్వతమ్మ ఆ రకంగా మాట్లాడటానికి కారణం ఏమిటో ఆయన బుర్ర కెక్కలేదు. ఆమెకి ఇష్టంలేనివీ, కష్టం కలిగించేవీ తాను ఏనాడూ చేయలేదు. అట్లాంటి ఊహ కూడా ప్రకటించలేదు. కాని చిత్రం ఏమిటంటే తన మనసులో అట్లాంటి ఊహ కలుగుతున్నట్లు ఆమె ముందుగానే పసికడుతుంది. ఇది వొక్క స్త్రీలకే సాధ్యమేమో? అవతలివాడి మనసు నెరిగి ప్రవర్తిస్తాడనీ, ఎవరినీ నొప్పించడనీ ఆఫీసులో పేరు తెచ్చుకున్న కుటుంబరావు తన భార్య పరేంగితజ్ఞతను తల్చుకు ఆశ్చర్యపోతూ అక్కడ్నించి లేచాడు.

సాలోచనగా మెట్లెక్కి డాబామీదికి వొచ్చాడు కుటుంబరావు. చీకటి పడిపోయింది. వీధిలో దీపాలు వెలిగాయి. పక్క యిళ్ళల్లోనుంచి వంటతాలూకు ఘుమాయింపులు వొస్తున్నాయి. పెరట్లో చెట్లు గాలి




వేడిమివల్ల నిశ్చలంగా ఉన్నాయి. కుటుంబరావు అంతా దృష్టిసారించి చూశాడు. ఆ చుట్టుపక్కల కనుచూపు మేరలో ఉన్న యిళ్ళల్లో గత పాతిక ముప్ఫయి సంవత్సరాలుగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఆ వీధికి తమ యింటిపేరే పెట్టించుకున్న లక్షాధికారిగారి మేడ చేతులుమారింది. అయనకి పోటీ లక్షాధికారిగారి మేడ శిథిలావస్థలో ఉంది. ఖాళీగా చెత్తా చెదారంతో ఉండే ఆ పక్క ఖాళీస్థలంలో ముచ్చటైన రెండు డాబాలులేచాయి. వొక అతిబీద బడిపంతులు మునుపు కాపురం వున్న యిల్లు యిప్పుడు తన శిథిలరూపాన్ని వొదిలించుకుని కళకళ లాడుతోంది. అంతేకాదు, ఆ ఇళ్ళల్లో మునుపు వొక్క కులంవారే ఉండే వారు. ఇప్పుడు వివిధ కులాలవారే కాదు. వివిధ మతాలవారు కూడా ఉంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే వీధి ఎంతోమారిపోయింది. ఎంత నశించిందో అంతకుమించి అభివృద్ధి పొందింది

కుటుంబరావు తన ఆలోచనలకి తానే నవ్వుకున్నాడు. వొంటరిగా, కనుచూపుమేరవరకూ కనిపించేదాన్ని చూస్తూ, దాన్ని గురించే ఏవేవో వెర్రిమొర్రి ఆలోచనలు చేస్తూ, గంటల తరబడి గడిపెయ్యటం ఆయనకి చిన్నప్పటినుంచీ అలవాటే! "నువ్వు కవివి కావలిసినవాడివిరా! ఖర్మకాలి ఎకౌంటెంట్ వయ్యావు?" అనేవాడు శర్మ. ఆ శర్మ కిప్పుడు పెళ్ళీడుకెదిగిన పిల్లలు! తనకి లేరూ? అలాగే!

దగ్గర్లో ఎవరో నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. కొద్దిగా ఉలిక్కిపడి

అటుచూశాడు కుటుంబరావు. తన కొడుకూ కూతురూ న! పిట్టగోడ నానుకు కూచుని ఏదో మాట్లాడు కుంటున్నారు. అది తనని గురించే కావచ్చునని కుటుంబరావుకి వెంటనే అనుమానం తట్టింది.

"ఏవిటర్రా?" అన్నా డాయన నవ్వుతూ.

"ఏంలేదు నాన్నా" అన్నది సావిత్రి.

"అబద్ధా లాడకూడదని బళ్లో మీ మాస్టరు చెప్పలేదూ?"

"ఇంట్లో మాస్టరుకూడా చెప్పాడు"

"కావున - నిజం చెప్పు."

"నువ్వు - కోప్పడవుగా?"

"ఎప్పుడన్నా కోప్పడ్డానా?"

అది పచ్చి నిజమే అయినా ఆ యింట్లో ఆ విషయాన్ని పట్టించుకున్న వాళ్ళెవరూ లేరు. సూర్యుడు తూర్పున ఉదయించటం, ఎండాకాలంలో మామిడి పళ్ళు అమ్మరావటం ఎంత సహజమో ఆ తండ్రి ఆ బిడ్డల్ని గదమాయించక పోవటమూ అంత సహజం అన్నట్టుగా జరిగిపోతోంది. సావిత్రి ఆ ప్రశ్న అడగటం కుటుంబ రావుకి ఎక్కడో దెబ్బ తగిలినట్టుగా అనిపించిందికూడా. తన కూతురు దొంగమాటలు నేర్చుకుంటోందా?

"మరైతే చెప్పు శర్మగారెవరు?" అన్నది సావిత్రి.

"నా చిన్ననాటి స్నేహితుడు."

"మంచివారు కాదా?"

కుటుంబరావుకి నవ్వొచ్చింది. పెళ్ళి కాని ఆడపిల్లవి నువ్వు, ఇంట్లాంటి ప్రశ్నలు అడుగుతున్నావని తెలిస్తే లోకం ఎంతగా నోరు నొక్కు కుంటుందో తెలుసా?" అన్నాడు.

"లోకం అంటే ఎవరు?"

కుటుంబరావు కూతుర్ని దగ్గరకు తీసుకుని "నా తల్లి రత్నం - రత్నం" అన్నాడు

సావిత్రి సిగ్గుపడుతూ "చెప్పు నాన్నా" అన్నది.

"చెప్పటానికి నాకేం అభ్యంతరం లేదమ్మా. కాని మీ యిద్దరికే విసుగెత్తు తుందేమో నని చూస్తున్నాను" అన్నాడు.


"విసుగెత్తితే చెబుతాంగా? -ఏంరా అన్నయ్యా?" అన్నది సావిత్రి.

అన్నయ్య చిన్నగా నవ్వాడు

కుటుంబరావు చెప్పటం ప్రారం భించాడు.

* * *

పల్లెటూళ్ళ అభివృద్ధికి వగైరాలకి లక్షలూ కోట్లూ ఖర్చు పెడుతున్న ఈరోజుల్లోనే వాటికి వెళ్ళటానికి సరైన రోడ్లులేవు. సరైన రోడ్లు ఉండటానికి ఎట్లాంటి వీలూలేని రోజుల్లో కుటుంబ రావూ, శర్మా తమ పల్లెటూరికి పధ్నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న




ఒక నగరంలో కాలేజీలో చదువుకుంటూండేవారు. ఇద్దరి తండ్రులూ రైతులే, కులానికి కరణాలైనా నాగలి చేతబట్టినవారే. శర్మ తండ్రి లక్ష్మీపుత్రుడు. కుటుంబరావు తండ్రి సామాన్యగృహస్థు. వాళ్ళిద్దరిశరీరాలూ రెండేమో గాని మనసు ఒకటే.

శర్మకి అతని పద్దెనిమిదోఏట చాలా చిత్రమైన పరిస్థితుల్లో పెళ్ళయింది. శర్మ తండ్రి రామకృష్ణయ్యకి 'ధర్మప్రభువు' అని ఊళ్ళో పేరుండేది. ఊళ్ళో ఎవరింట్లో ఏ కార్యం వచ్చినా, కష్టం వచ్చినా రామకృష్ణయ్య సహాకారహస్తం ముందుకు వచ్చేది. ఆయనకి కులవివక్షత లేదు. మతవివక్షతా లేదు. అది యిష్టం లేకపోయినా ఆయన బొక్కసాన్ని చూసి ఝడుసుకుని ఊళ్ళోని మడిబట్టల జనాభా ఆయన్ని వెలివేయలేదు. అందుకాయన వాళ్ళని యిఝ్యాబట్టలేదు - డబ్బుకి దాసులు మీరని. అసలు విషయమే ఆయన పట్టించుకునేవాడు కాదు.

అట్లాంటి రామకృష్ణయ్యకి జీవితాంతం ఉండిపోయిన ఒక బలహీనత లక్ష్మీదేవి లాంటి భార్య, పరమ సాధుశీల పార్వతమ్మ, యింట్లో ఉన్నా ఆయన దృష్టి పరస్త్రీలమీదికి పరుగులెత్తేది. అవసరమైతే ఎంత దూరమైనాసరే పోయి తన విలాసాన్ని తీర్చుకు వచ్చేవాడు. అలాగని మెళ్ళో ఎముకలు కట్టుకు తిరిగినవాడు కాదు.


ఆయన్ని చూస్తూంటే కుటుంబరావుకి ఒక చిన్న కథ గుర్తు కొచ్చేది. కాళిదాసుకు కూడా స్త్రీ వ్యసనం ఉండేదిట. ఆ విషయం పసిగట్టిన ఒక శిష్యుడు 'యింతటి జ్ఞానులు మీరు! యిదేమిపని స్వామీ?' అని అడిగితే 'రాత్రి పన్నెండు దాటింతర్వాత చెబుతాను' అన్నారట. ఆ రాత్రి శిష్యుడు కాపలా వేశాడు. గురువుగారు అతని ఊసే ఎత్తుకోలేదు. ప్రియురాలితో హాయిగా గడిపాడు. ఆ తర్వాత ఆ ప్రియురాలే మరొక గదిని శుభ్రపరిచి, మధ్యలో పద్మంగా ముగ్గు పెట్టి, పూజాద్రవ్యాలు పెట్టి యివతలికి వచ్చిందట. సుస్నాతుడైన కాళిదాసు లోపలికి వెళ్ళి తలుపు మూసుకున్నాడు. వెలయాలు శిష్యుని ఆత్రం కనిపెట్టి కిటికీలోనుంచి చూడమన్నది. శిష్యుడు తొంగి చూశాడు. కాళిదాసు సిద్ధాసనంలో ఉన్నాడు. కొద్ది సేపట్లోనే ఆ మహాకవి శరీరమంతటా అగ్ని జ్వాలలు లేచాయి. శరీరమంతా భగ భగ మండిపోయింది. శిష్యుడి ప్రాణం జిల్లుర్చుక పోయింది. కొంత సేపటికి మంటలు ఆరిపోయాయి. మహాకవి యినుమడించిన తేజస్సుతో యివతలికి వచ్చాడు.

ఆ శిష్యుడికి గురువుగారిని చూసి జాలిపడగల ధైర్యం, శక్తి లేవు. కాని కుటుంబరావుకు రామకృష్ణయ్యగార్ని చూసి జాలిపడతాడు. పార్వతమ్మ గారు లోపల ఏం బాధపడ్డదో గాని పైకి మాత్రం నవ్వుతూనే కనిపించేది. ఆ దంపతులకి శర్మ తరవాత ఒక ఆడపిల్ల కలిగింది — ఆరో నెలలోనే కన్ను మూసింది.

అట్లాంటి తండ్రి కడుపున పుట్టిన శర్మ చాలా మంచివాడుగా, ఒకరి జోలి సొంటి అక్కర్లేనివాడుగా పెరిగాడు. కుటుంబరావు తప్ప అతనికి వేరే స్నేహితు లెవరూలేరు. అతనికి తల్లిదండ్రుల దగ్గిర కావలసినంత చను వుండేది. కుటుంబరావు దగ్గిరకూడా అంతే!

శర్మకి పద్దెనిమిదో యేడు రాబోతూండగానే పార్వతమ్మగారు కొడుకుకు పెళ్ళిప్రయత్నాలు ప్రారంభించింది 'నీ కొడుకుకూడా మీ ఆయన లాగా తయారౌతాడని భయమా?' అంటే ఆవిడ చాలా నొచ్చుకున్నట్టు కనిపించేది. అందుకు మొదటి కారణం ఆవిడ భర్త పరమదుర్మార్గుడని అను కోకపోవటం, రెండోది తన కొడుకు మీద ఆవిడకి విపరీతమైన నమ్మకం ఉండటం, నవ్వులాటకికూడా అట్లాంటి ప్రశ్నలు అడగొద్దని ఆవిడ నిష్కర్షగా చెప్పేసింది.

కాని, అసలు కారణం, ఊళ్ళో ఎవరికీ తెలియకపోయినా కుటుంబ




రావుకి తెలిసింది — వాళ్ళ పొలాల్లో కూలిపని చేసే ఒకానొక పనిపిల్లని శర్మ గమనించాడను. సౌందర్యాభిప్రాయాన్ని పార్వతమ్మగారి దగ్గర అస్తమానం కీర్తించటం ప్రారంభించింది. ఆ పిల్ల అందమైనది కాక పోవచ్చునుగాని ప్రతి యువకుడూ ఆశించే శరీరలక్షణాలన్నీ ఆపిల్లలో పుష్కలంగా ఉన్నాయి. శర్మ జడభరతుడు కాదుగదా! పార్వతమ్మగారు ముందుకు ఆలోచించింది!

ఒకటిన్నర లకారందాకా ఆస్తి. అందులో వొక్కగా నొక్క కొడుకూ అయిన శర్మకి పెళ్ళి తలపెడతున్నారనగానే ఆడపిల్లలు కలవారంతా ఆ యింటిముందు ఈగల్లా ముసరటం ప్రారంభించారు. ఇంటికైన పిల్లని, దీపంలాంటి చిన్నదాన్ని ఎన్నిక చేసే బాధ్యత తన భార్యకి వొదిలేశాడు రామకృష్ణయ్య. పార్వతమ్మ కుటుంబరావు చెల్లిని వెంటేసుకుని, మగదక్షతగా కుటుంబరావు తండ్రిని తీసుకుని అన్ని సంబంధాలూ చూసింది. చివరికి బెజవాడలో తాడంకివారి చిన్నదాన్ని ఎన్నికచేసి వివాహం ఝామ్మని జరిపించింది. మిగతా అడ్డుకూడా మరో ఏడాదిలోగా ముగింపించింది. ఆ పెళ్ళిలో బంధువులకల్లా 'సాటి' వారి పిల్లా ఆకుటుంబం. ఆయిల్లాలూ కొన్ని మాటలు పడకపోలేదు. ఆమె కట్నాలూ కానుకలూ అడగలేదు. సలక్షణంగా ఐదురోజుల పెళ్ళి జరిపించమన్నది. అంతటివారి సంబంధం దొరికితేనే చాలనుకున్నది. వియ్యాలవారు ఆ యిల్లాలి కోర్కెను హాయిగా స్వీకరించాడు. పొర

పొచ్చులూ, కలతలూ లేకుండా ఆ వివాహం జరిగిపోయింది. కాని ఆ పిల్ల వెంట చీనిచీనాంబరాలూ, బళ్ళకొద్దీ రూపాయలూ రాలేదు. రాకపోవటం 'సాటి' వారికి చాలా చిన్నతనంగా కనిపిస్తే నవ్వి ఊరుకుంది పార్వతమ్మ.

శర్మకి భార్యగా వొచ్చిన అదృష్టవంతురాలు చూడచక్కని చిన్నది. ఆమెతో నేస్తం కట్టిన రోజునుంచీ కుటుంబరావుకీ అతనికీ మధ్యనున్న స్నేహబంధం కాస్తంత వొదులు కావటం మొదలుపెట్టింది. చదువు కోసం మకాంపెట్టిన ఊళ్ళోనే అత్తవారిల్లుకూడా ఏర్పడిందేమో — శర్మ శృంగార జీవితానికిపూలబాటలు వేసినట్లయింది. చిలకాగోరింకల్లా ఆ యిద్దరూ ఏడాది గడిపేశారు చదువు తువర మవుతుందేమోనన్న ఆందోళన కుటుంబరావుకి కలగలేదు. ఎందుచేతనంటే శర్మలో ఆనాడూ ఈనాడూ కూడా వొకగొప్ప గుణం కనిపిస్తుంది శర్మ తెలివైనవాడు మాత్రమే కాదు; ఖచ్చితమైన వాడుకూడా సాయంత్రం ఏడింటికో ఎనిమిదింటికో అతను అత్తవారింటికి వెళ్ళేవాడు. 'ఉదయం ఎనిమిదింటికి 'గుహ'కి వొచ్చేవాడు. పగల్లా అతను శ్రద్ధగానే చదివేవాడు. అంతటి మనోనిగ్రహం ఆ లేతవయసులో ఎలా సాధించగలిగాడా అని కుటుంబరావు యిప్పటికీ ఆశ్చర్యపోతాడు.

ఆ ఏడాది పూర్తయింది, అంతటితో ఆయువకు లిద్దరి చదువూ ఆ ఊరిలో ఐపోయింది. పరీక్షలు ఝూంమనిరాసి ఆ తర్వాత నాలుగైదు రోజులపాటు భార్యతో షికార్లు కొట్టి చాలా మనోహరమైన కబురు మనసులో యిరికించుకొని మిత్రుడితోపాటు యింటికి బైల్దేరాడుశర్మ. దోవపొడుగునావాళ్ళిద్దరికీ వికవికలూ పకపకలూను, కుటుంబరావుకి అంతరాంతరాలలో ఎక్కడో చిన్న యెత్తు అసూయలాంటిది కలిగేది. వాడి కేమిటి? వడ్డించిన విస్తరి వాడి జీవితం! రేపు పండులాంటి కొడుకుని కూడా కంటాడు. అనిపించేది. కాని స్నేహితుడిమీద వరసరాల్లోనూ జీర్ణించుకుపోయిన అనురాగం ఆ తలంపు తాలూకు అసూయాఛాయను దిగంతాలకు విసిరేసి ఆ స్థానంలో మరింత వాత్సల్యాన్ని నింపేది

పరీక్షా ఫలితాలు తెలిసిన రోజున రామకృష్ణయ్యగారు ఊరంతటికీ విందు చేశారు. ఆ విందు ఒక్క శర్మకోసమే కాదు. కుటుంబరావు కోసంకూడా. ఆ యిద్దరి 'క్వాలిఫికేషనూ' ఆ రోజుల్లో హిమాలయ శృంగమంత గొప్పది. ఊరంతా ముక్కున వేలేసుకుంటే పార్వతమ్మగారు దష్టి తీసి పారబోసింది—బిడ్డ లిద్దరికీ!

ఆ తర్వాత కర్తవ్యం ఏమిటీ అని

ఆ తండ్రు లిద్దరూ ఆలోచించారు. కుటుంబరావు తండ్రి తన ఆర్థికస్థితి దృష్ట్యా కొడుకు చదువును అంతటితో ఆపి ఏదోవొక ఉద్యోగంలో ప్రవేశ పెడతా నన్నాడు. శర్మని 'లా' చదివించటానికి నిర్ణయించుకున్న రామకృష్ణయ్యగారు. కుటుంబరావుని కూడా చదివించమనీ, అందుకు కావలసిన ద్రవ్యసహాయం తాను చేస్తాననీ ముందుకు వొచ్చాడు. కుటుంబరావు తండ్రి అందుకు అంగీకరించలేదు. ఫలితంగా కుటుంబరావు గుమాస్తాగా మారాడు. శర్మ లా చదవటానికి మద్రాసు వెళ్లాడు.

దసరా సెలవులకని బెజవాడ వచ్చిన శర్మకి భార్య కొడుకుతో సహా కనిపించింది. బారసాల వగైరా కార్యక్రమాలు రామకృష్ణయ్యగారి హోదాకి తగ్గ స్థాయిలోనే తాడంకి వారింట జరిగాయి. దాదాపు వారం పదిరోజులపాటు అత్తవారింటనే గడిపిన శర్మ, కుటుంబరావుతోసహా తన వూరికి బైలుదేరాడు. అసలే వానల రోజులు, ఆపైన పచ్చిబాలింతరాలు గనక శర్మ భార్యని వెంటతీసుక రావటానికి వీలులేకపోయింది.

ఆ సెలవుల్లో అతను తల్లీదండ్రీ కోసం పల్లెటూరు ప్రయాణం తలపెట్టకపోతే అతని జీవితంలో జరగాలని రాసిపెట్టివున్న సంఘటన, అతని జీవితానికి కొత్తమలుపు తిప్పిన సంఘటన, జరిగేది కాదేమో ననిపిస్తుంది కుటుంబరావుకి. దారంతా ఆ ఇద్దరికీ కొట్టినపిండే గనక తండ్రి రెండెడ్ల బండి పంపుతానన్నా బద్దన్నాడు శర్మ. అప్పటికీ నవనాగరికంగా మారిన చెన్నాపట్నం వాతావరణం ఆ పల్లెటూరి అబ్బాయి కేమంత అమోఘంగా లేదు. చేలల్లో అడ్డంపడి నడవాలనీ, నిర్మలమైన ఆ గాలి పిల్చాలనీ అతని మనసు ఉరకలు వేసింది. పుత్రోత్సాహము అందుకు దోహదం చేసింది.

శర్మ వన్నెచిన్నెలుగా వర్ణించి చెబుతూన్న మద్రాసునగరంకబుర్లు ఆసక్తితో వింటూ, అతనిలో కలిగిన వాగుడు లక్షణానికి తల్చుకు అశ్చర్యపోతూ కుటుంబరావు అతన్ని అనుసరించాడు. కొద్దిదూరం నడిచేసరికి ఆకాశంలో మేఘాలు కమ్ముకొచ్చాయి. మరికొద్దిదూరం నడిచేసరికి కుండపోతగా వాన ప్రారంభమైంది.

మిత్రులిద్దరూ చెప్పులువిడిచి చేత్తో పట్టుకుని చేతిసంచీలు బుజా నేసుకుని పరుగెత్తటంలాంటి నడక ప్రారంభించారు. ఊరి పొరిమేరల్లోకి వచ్చేసరికి వానజోరు మరింత ఎక్కువైంది. అప్పటికే పట్నవాసపునీళ్లు వొంటబట్టిన శర్మ 'ఇక పరిగెత్తలేనురా బాబూ?' అనటంతో ఇద్దరం దగ్గర్లో వున్న గుడిసెలో దూరక తప్పలేదు.



వాళ్ళిద్దర్నీ చూసి ఆయింట్లో ఏకాంతంగావున్న నల్లటిచిన్నది బేజారై పోయింది. ఆమెనిచూసి మిత్రులిద్దరూకూడా కొంచెం కంగుతిన్నారు. ఆ అమ్మాయి నావూళ్లో వాళ్లు ఇదివరకెన్నడూ చూడలేదు. కనుక వారెవరో ఆమెకూ తెలియదన్నమాట! ఒంటరిగా వున్నందునా, ఆగంతకులిద్దరూ యువకులైనందునా ఆమె చెదరటమూ సహజమే.

"మాది ఈవూరే! ఇతను తుర్లపాటి రామకృష్ణయ్యగారి అబ్బాయి శర్మ. నేను..." సంజాయిషీ యిచ్చుకున్నాడు కుటుంబరావు ఆ అమ్మాయి వెంటనే తడికెచాటుకి తప్పుకొని, "ఆయనింట్లో లేరు" అన్నది నెమ్మదిగా.



"ఇది రాములు ఇల్లు కదరా?" అన్నాడు శర్మ.

కుటుంబరావు తలఊపి "నువ్వు అతని భార్యవా అమ్మాయ్!" అని అడిగాడు.

"ఔనయ్యగారూ" అన్న దాపిల్ల.

"రాములు చెప్పకుండానే పెళ్ళి చేసుకున్నాడన్నమాట. ,రానీ వాడి పని చెబుతా."

తడికె వెనకనుంచి చిన్న నవ్వు వినిపించింది.

"వానలో పోలేక వచ్చాం. తగ్గగానే వెళ్ళిపోతాం" అన్నాడు కుటుంబరావు.

ఈసారి ఆ అమ్మాయి తడికవతలికి తొంగిచూసింది. "బాబుగార్లు ముద్ద ముద్దయిపోయారు. తువ్వాలివ్వమంటారా?" అన్నది. అక్కర్లేదు అనబోయిన కుటుంబరావు అప్పటికే కొద్దిగా వొణుకుతూన్న శర్మనిచూసి నవ్వుకుని

తన సంచిలోంచి తువ్వాలు తీసి యిచ్చాడు. ఆ తర్వాత యిద్దరూ తడి బట్టలు విప్పేసి సంచిలో తడవకుండా మిగిలివున్న పొడిబట్టలు తీసి కట్టుకున్నారు. శర్మకి చలి యింకా పోక పోవటం మాసి ఆర్నెల్ల పట్నవాసానికి అంత అర్భకుడివి ఐపోయినా వేంరా!" అన్నాడు.

శర్మ సిగ్గుగా నవ్వాడు.

"పాలు నైన్ల! ఇవ్వమంటారా బాబుగారూ?'' అన్నదా పిల్ల లోపల్నుంచి.

'ఏరా? తాగుతావా ?''అన్నాడు కుటుంబరావు

శర్మ తల వూపాడు.

పది నిముషాల తర్వాత వేడివేడి పాలు, రెండు జర్మన్ సిల్వర్ గ్లాసుల్లో తెచ్చి అక్కడ పెట్టి తడికెవెనక్కి తప్పకుం దాపిల్ల ఆ అమ్మాయి 'పాలు కావాలా?' అని అడగటంతోనే ఆమెకి తమ కుటుంబాలను గురించిన వివరాలు తెలిసివుండాలని ఊహించాడు కుటుంబరావు. లేకపోతే కులభేదం తెలిసిన ఆమె 'అంతటి సాహసం' చెయ్యదు. ఇద్దరూ తృప్తిగా ఆ గ్లాసులు ఖాళీ చేశారు. వాన తెరపి యివ్వటంకోసం ఎదురు చూస్తూ కబుర్లలో పడ్డారు.

కాని ఆ వాన అంత తేలికగా వొదల్లేదు. ఆకాశానికి చిల్లిపడ్డట్టుగా కుండపోతగాకురవసాగింది. ఆకాశంలో ఉరుములూ మెరుపులూ ప్రళయ భయంకరరూపం దాల్చాయి. ఇంత దూరమూ వొచ్చి చివరి కీ గుడిసెలో యిరుక్కు పోయామే అన్నదుగ్ధ కుటుంబరావుని బాధించసాగింది. రాత్రి గడిచిపోతోంది. బైటకి కదిలే దోవ కనిపించటం లేదు.

"రాత్రికిక్కడ వుండిపోవాలి లాగుంది" అన్నాడు చివరికి.

శర్మ జవాబివ్వలేదు.

"తడిస్తే తడిశాం; పోదామా?"

"ఊఁ?" అన్నాడు శర్మ అయోమయంగా.

కుటుంబరావు మిత్రుడిలోని మార్పుకి తెల్లబోయి అతనివంక చూశాడు. గుడ్డిలాంతరు వెలుగులో అతని కళ్ళు తడితడిగా కనిపించాయి. కుటుంబరావు సందేహంతో అతని చెయ్యి పట్టుకున్నాడు. కాలిపోతోం దది.

ఆ వెంటనే శర్మ నేలమీదికి వాలాడు — నెమ్మదిగా. తడితడిగా వున్న ఆ నేలమీద ఆ 'సుకుమారుడు' పడుకుంటే యింకేమన్నా ఉందా? కుటుంబరావుకి మతి పోయింది. రచ్చొవగా మూల నున్న ఈతాకులచాప తీసి "దుప్పటి వుందా అమ్మాయ్?" పిలిచాడు కుటుంబరావు.

ఆ పిల్ల కొద్దిగా తడికె యివతలికి తొంగి చూసింది. ఆ యిద్దరి వంకా

చూసి పరిస్థితి అర్ధం చేసుకుంది. అక్కడే వో మూలగా వున్న సందుగు పెట్టెలోంచి నీరుకావిపట్టిన దుప్పటి తీసి కుటుంబరావు చేతికి అందించింది. అతను అది మిత్రుడిమీద కప్పాడు.

కాని, వర్షం ఎంత అకస్మాత్తుగా ఉధృతంగా వొచ్చిందో శర్మ జ్వరమూ అంత అకస్మాత్తుగా ఉధృతం అయింది. చాలా కొద్దిసేపట్లోనే అతనికి స్మారకము తప్పిపోవటమేకాక చలితో ఎగిరెగిరి పడసాగాడు. కుటుంబరావు కేం చెయ్యాలో పాలుపోలేదు. చొరవ చేసి సందుగు పెట్టెలోనుంచి కప్పటానికి వీలున్న బట్టలన్నీ తీసి మిత్రుడి మీద కప్పాడు. అతని కిదంతా బాధాకరంగానే కాక అవమానకరంగా కూడా తోచసాగింది. ఆ అమ్మాయి కట్టుకునే చీరెలు అతనిమీద కప్పాడు తను!

మిత్రుడికి కాస్త యివతలగా పొడి తువ్వాలొకటి పరుచుకుని నడుం వాల్చిన కుటుంబరావుకి కొద్దిసేపట్లోనే నిద్ర పట్టిపోయింది. ఆ నిద్ర నిద్ర అతను లేచేసరికి బైట తెల్లటి ముసురుకాంతీ, కుండపోతగా వానా కనిపించాయి. త్రుళ్ళిపడి లేచిన అతని కంటికి శర్మ చెయ్యి తన ఒళ్ళో పెట్టుకుని నిద్ర పోతున్న ఆ అమ్మాయి కనిపించింది!

ఒకక్షణందాకా కుటుంబరావుకు అది కలో నిజమో అర్ధంకాలేదు. ఆమె నెట్లా మేలుకొలపాలో తోచక రెండు సార్లు నెమ్మదిగా దగ్గాడు. మూడో సారి కాస్తంత గట్టిగా దగ్గగా ఆ అమ్మాయి చట్టుక్కున మేలుకున్నది. తన వొడిలో ఆ యువకుడి చెయ్యి ఉన్నదని గ్రహించి, సిగ్గుతో అది తొలగించి, పైట సవరించుకుంటూ తడికె అవతలికి వెళ్ళిపోయింది.

"ఏమైందమ్మాయీ?" అన్నాడు కుటుంబరావు.

ఆ పిల్ల జవాబివ్వలేదు.

కుటుంబరావు మిత్రుడి చెయ్యి పట్టుకు చూశాడు. జ్వరం తీవ్రంగానే వున్నా అతని శరీరం యిందాకటి లాగా (!) గజగజ వొణకటంలేదు. మనిషి స్మారకంలో లేడు. ఏం చెయ్యాలో అని ఆలోచిస్తుండగానే ఆ పిల్ల లోపల్నుంచి గ్లాసు పట్టుకు వొచ్చింది. ఆ గ్లాసులో ఉన్నదాని వాసన చూడంగానే కుటుంబరావు ఆశ్చర్యపోయాడు.

అందులో కనబడుతున్నది వొక రకమైన కషాయం. మిరియాలూ వగైరాలతో తయారుచేస్తారది. కుటుంబరావు యింట్లోనూ రామకృష్ణయ్యగారియింట్లోనూ ఎవరికైనా నలత చేస్తే అది తయారుచేసి రోగి కివ్వటం అతనికి తెలుసును. తాగటానికి బాధాకరంగా ఉన్నా దానివల్ల ఫలితం మాత్రం బాగా ఉంటుంది.

మలేరియా కది చిట్కావైద్య మన్న మాట. ఆ పిల్ల అది తయారు చేసి తీసికొచ్చేసరికి అకస్మాత్తుగా అతని కళ్ళు చెమర్చాయి

"వొకరాత్రివేళ కాస్తంత తాగించండి. జ్వరం తగ్గిపోద్ది" అన్నదా అమ్మాయి.

ఆ మందు మిత్రుడి చేత తాగించటంకోసం చాలా అవస్థ పడవలసొచ్చింది కుటుంబరావు కాస్తంత కులాసా చిక్కాకనే వాడి పరిస్థితి అట్లా వుందికదా? పూర్తిగా స్మారకంలేని స్థితిలో ఆ యువతి వాడి చేత మందు ఎట్లా తాగించిందా అని ఆశ్చర్యపోయాడతను. మందు తాగించటం ఐనాక "నీ ఋణం తీర్చుకోలేమమ్మా" అన్నాడు. "అదేంటయ్యగారూ? లచ్చరూపాయి లిచ్చినా మిలాంటోరు యిక్కడికొస్తారా? ఆయన లేక పోమట్టిగాని... అయనే ఉంటే..." అన్నదా యువతి నిష్కల్మషంగా.


కుటుంబరావు కదిలిపోయాడు. ఆమెలో ఉన్న భక్తిపరాయణతకి తాము తగుదుమా అనుకున్నాడతను. ఏవూళ్లో పుట్టిందో ఆమె? ఈ వూరికి కోడలుగా వొచ్చింది. రామకృష్ణయ్యగార్నిగురించి ఆమె రాములు ద్వారా విని వుంటుంది. అంతమాత్రాన... ఆమె నిర్మలహృదయా స్నేలా పొగడాలో అతని కాతుణాన అర్థంకాలేదు.

ఆ సాయంత్రందాకా మిత్రులిద్దరూ అక్కడే వున్నారు. అప్పటికి వాన తెరప యిచ్చింది: ఇంట్లో వున్న కాసిని పాలూ కుటుంబరావుకి బలవంతంమీద యిచ్చి తాను కడుపు మాడ్చుకున్న దా పిల్ల శర్మకి జ్వరం పూర్తిగా జారి పోయాక కుటుంబరావు బైటికి వొచ్చి చూశాడు. ఊరంతా సముద్రంలాగా ఉంది. వీడ్ని యింటికి చేర్చటం ఎల్లాగ? లోపలికి వొచ్చి "నేను బండి తీసుకొస్తాను; వెళ్ళిరానా?" అన్నాడు శర్మతోటి.

"అలాగే'' తలవూపాడు శర్మ.

ఇంటికొచ్చి ఈ సంగతి చెప్పేసరికి పార్వతమ్మగారు బేజారైపోయింది. జమీందారులాంటి తనబిడ్డ యిరవై నాలుగు గంటలపాటు వొక గుడిసెలో గడిపాడనంగానే ఆమె గుండె తరుక్కుపోయింది. రామకృష్ణయ్యగారు, ఆ నీళ్ళలో బండి నడవటం కష్టం అని తెలిసినా గిత్తల్ని కట్టించి బండి సిద్ధం చేయించాడు. ఆ బండిలో ఆయన్తో గుడిసె దగ్గర కొచ్చేసరికి శర్మ నవ్వుతూ ఆ అమ్మాయితో ఏదో చెబుతున్నాడు. ఆ యువతి తడికె దగ్గరగా కూచుని వుంది.

శర్మని బండిలో యింటికి తీసుకు వొచ్చారు. వొక్కరోజు జ్వరానికే మనిషి తోటకూరకాడలాగ వేల్లాడి పోతున్నాడు. కుటుంబరావు జరిగిం




దంతా పూసగుచ్చినట్టు పార్వతమ్మ గారితో చెప్పాడు. ఆ నల్లపిల్ల కషాయము కాచి యిచ్చిందని వినంగానే ఆమె ముఖం సంతోషంతో, ఆప్యాయతతో వెలిగిపోయింది. ఆ తర్వాత వారం రోజులకి శర్మ మామూలు మనిషైనాడు. పార్వతమ్మగారు రాముల్ని, ఆ అమ్మాయినీ యింటికి పిలిపించి బట్టలు పెట్టించి సత్కరించింది.

ఆ తర్వాత నాలుగైదు రోజులకి కుటుంబరావు బెజవాడ తిరిగొచ్చేశాడు. కాలేజికి కాస్తంత పెద్ద సెలవే పెట్టి. యింట్లోనే వుండిపోయాడు శర్మ. నెలరోజుల తర్వాత మద్రాసు పోతూ కుటుంబరావును కలుసుకోవటానికి వొచ్చాడు. ఇద్దరూ వొకటి రెండు రోజులు గడిపారు. వెళ్ళిపోయే రోజున స్టేషనుకి అతని మావగారు వగైరాలు కూడా వొచ్చారు. ట్రెయిన్ రావటానికి ముందే స్టేషనుకి అంతా రావటాన మావఁగార్ని వొకచోట కూచోపెట్టి మిత్రుడ్ని ప్లాట్‌ఫాం చివరికి లాక్కుపోయాడు శర్మ.

"ఎవిఁటి రహస్యం?'' అన్నాడు కుటుంబరావు కూచుంటూ.

"రహస్యంలేదూ నా బొందాలేదు గాని...వొక తమాషా చెప్పనా?" అన్నాడు శర్మ.

"చెప్పు."

''నల్లపిల్ల పేరు సత్యవతిట."

"అందులో తమాషా ఏవుంది?"

"ఎంత నాజూకైన పేరు.''

"దాన్దేవుందిలే."

శర్మ తల పంకించి, సాలోచనగా

"కాని ఆ రోజు నా జీవితంలో మర్చిపోలేను భాయీ! ఆ అమ్మాయే లేకపోతే నేను ఆ రాత్రే హరీ అందునేమో?" అన్నాడు.

"వెధవమాటలాడకు" అన్నాడు కుటుంబరావు కించిత్ కోపంగా.

"నిజం మిత్రమా!...ఆ అమ్మాయి దేవతనుకో, ఆం!"

"నీ మొహం లేగాని ఏవంటున్నాడు మీ అబ్బాయి?"

"పొద్దునేగా చూశావు? ఈలోగా ఎదిగిపోయాడా?"

"చాలా అదృష్టవంతుడివి శర్మా! చక్కని భార్యా, అంతకన్న చక్కటి బిడ్డానూ."

శర్మ ముఖంలో ఆనందం వెల్లి విరిసింది. "నీకూ దొరుకుతుందిలేరా!" అన్నాడు అభయం యిస్తున్నట్టు.

"నీ మాట ఫలిస్తేనా?"

"ఏం చేస్తావు?"

"నువ్వు కోరింది యిస్తాను."

"నీ కూతుర్ని నా కొడుక్కు యిచ్చి చేస్తావా?"

కుటుంబరావుకి తమాషా చెయ్యాలనిపించింది. "నా కాళ్లు పట్టుకుంటే ఆలోచిస్తాను" అన్నాడు.

శర్మ మిత్రుడి భుజంమీద చెయ్యి వేసి "నీకు నిజంగా ఆ కోరిక ఉంటే తప్పకుండా నెరవేరుస్తా[్రనా]!" అన్నాడు

కుటుంబరావు కంటనీరు తిరిగింది.

ఆ తర్వాత కుటుంబరావూ, శర్మా చాలా తక్కువసార్లు కలుసుకున్నారు. శర్మ 'లా' పూర్తి చెయ్యబోతుండగానే పార్వతమ్మగారు ఈ లోకం విడిచి వెళ్ళిపోయింది. ఆవిడ పోయినరోజున ఊరంతా కంటనీరు పెట్టింది. పిడుగు పడ్డా చలించని రామకృష్ణయ్యగారు ఆ విపత్తు మీదపడ్డాక పూర్తిగా మారిపోయాడు. సర్వసంగ పరిత్యాగిలా మారిపోయి, కాలం అంతా ఏకాంతంగా గడపసాగాడు.

ఉన్నట్టుండి వొకరోజున మద్రాసు నించి శర్మ కుటుంబరావుకి ఉత్తరం రాశాడు. మామూలుకబుర్లు ఐనాక "...ఈ ఉత్తరం చాలారహస్యంగా, ఎవరికీ తెలియకుండా ఉంచాలి. చింపి వెయ్యగలిగితే మంచిది. ఇప్పుడు నేను రాయబోయేదాన్నిబట్టి నువ్వేదన్నా ఊహించుకోదలిస్తే నా కేమీ అభ్యంతరంలేదు. నీ ఊహాలో నిజానిజాలు తెలియజెప్పటానికీ అభ్యంతరం లేదు. అసలు విషయం యిది. నువ్వు నా కో చిన్నపని చేసిపెట్టాలి. ఈ ఉత్తరం అందుకున్నవెంటనే నువ్వు మనవూరు వెళ్ళు. (సెలవు దొరకదని వంక పెట్టవద్దు, అవసరమైతే ఉద్యోగానికి రాజీనామా యియ్యి) నీకు సత్యవతి ఎవరో తెలుసును గా? ఆ అమ్మాయి వూళ్ళో ఉన్నదో లేదో, ఉంటే ఎట్లా




"క్రిందటి సంవత్సరం మీకు బంగారుగొలుసు, ఈ సంవత్సరం చెప్పులజత తొడుగుతున్నాను."

వుందో తెలుసుకుని నాకు వెంటనే ఉత్తరం వ్రాయి. ఆ అమ్మాయి పరిస్థితిలో ఏదన్నా 'చెడు' కనిపిస్తే వెంటనే ఉత్తరం రాయి. అశ్రద్ధ చేశావంటే వొక ప్రాణి నిష్కారణంగా చచ్చిపోవచ్చు." అని రాశాడు.

కుటుంబరావుకి ముందు అందులో వొక్కముక్క అర్థంకాలేదు. ఏమైనా మిత్రుడికోరిక తీర్చటం తన విధిగనక ఆరాత్రి బయలుదేరి ఊరు చేరుకున్నాడు. అర్ధాంతరంగా వూడిపడ్డ కొడుకుని చూసి అతని తల్లీ తండ్రీ ఆశ్చర్యపోయారు. వాళ్ళని చూడాలనిపించి వొచ్చానని బొంకాడు కుటుంబరావు.

"రామకృష్ణుడ్నిచూసి ఒచ్చావా?" అనడిగాడు తండ్రి.

"లేదు. వెళ్తాను."

"వెళ్లేదేదో, తొందరగా వెళ్ళు... ఎక్కువకాలం బతగడు వాడు."

కుటుంబరావు తెల్లబోయాడు. ఏం జరిగింది ? ఆయనకి సుస్తీ చేసిందా ? ఈ సంగతి శర్మకి రాయలేదా ? సవాలక్ష సందేహాలు అతనిమనసు నిండిపోయాయి.

"ఘాయిలాంటిమనిషి! వాడికి సుస్తీ ఎందుకుచేస్తుందిరా? అంతా నీ స్నేహితుడి నిర్వాకమే" అన్నాడు తండ్రి.

"శర్మా !? వాడేంచేశాడు ?" అన్నాడు కుటుంబరావు.

"ఏంచేశాడో! వొకచే ప్రాణంగా మీది? సెప్పలేదూ?"

"ఉహుఁ."

ఆ రాములుగాడి పెళ్ళాన్ని తగులుకున్నాడు. వాడు ఊరంతా యాగీ చేస్తున్నాడు. చాలా?''

దిమ్మదిరిగినంత పనైంది కుటుంబ రావుకి. శర్మ ఇంతటి నీచానికి పాల్పడ్డాడా?" ఇట్లాంటి దరిద్రపుపని చెయ్యటంకాక తన సహాయం అర్థిస్తు న్నాడు! ఆ సమయంలో శర్మ కనిపించివుంటే చావబాది ఉండేవాడు కూడా! ఆ సాయంత్రందాకా తన గదిలో వొంటరిగా గడిపిన కుటుంబ రావు మనసు బరువెక్కిపోగా బైటికి వచ్చాడు. కాళ్లు అప్రయత్నంగా అతన్ని రాములు గుడిసెవేపుకి లాక్కు వెళ్ళాయి. గుడిసెముందు నిలబడివున్న సత్యవతి అతన్ని చూసి చటుక్కున లోపలికి వెళ్ళిపోయింది. కుటుంబరావు కా సమయాన వెర్రి ఆవేశమూ, మొండిధైర్యమూ కలిగాయి. సరా సరి గుడిసెలోకి వెళ్ళాడు. సత్యవతి తడికెవెనకాలకి తప్పుకున్నది.

ఒక్కక్షణం ఆగి "ఏవిఁటమ్మాయ్! ఊళ్లోవాళ్లు చెప్పుకుఁటున్నది నిజ మేనా?" అన్నాడు కుటుంబరావు.

ఆ అమ్మాయి జవా బివ్వలేదు.

"వాడికి పెళ్ళయిందనీ, బిడ్డడు కూడా వున్నాడనీ తెలుసునా?''

తడికె వెనకనుంచి చిన్నగా ఏడుపు వినిపించింది.

"అంతచేసి ఇప్పుడు ఏడిస్తే ప్రయో జనం ఏమిటి?"

సత్యవతి మరుక్షణాన యివతలికొచ్చి అతని కాళ్ళమీద పడిపోయింది. కాళ్ళు యివతలికి లాక్కోవటం తప్ప కుటుంబరావు ఏమీ చెయ్యలేక పోయాడు. కొద్ది సేపటికి ఆమె దుఃఖాన్ని తగ్గించుకో గలిగింది. వెక్కుతూ "వార్ని కాళ్ళుపట్టుకు ఒతిమిలాడాను బాబుగారు! నా మాట వినిపించుకున్నారు కారు. పాపిష్టిదాన్ని వారిమీద విసుక్కున్నానుకూడాను. ఎన్నొరకాలుగా చెప్పిచూశాను. ఏవిఁ శేవిఁటో చెప్పేవారు. నాతో సేయి తము చేయకపోతే ఆయ నింకా చెడి పోతారంట. పెద్దపెద్ద మాటలాడే వారు. ఏం చెయ్యను? నాకు చావన్న రాదు'' అన్నది.

"అంతమాటెందుకులే?" అన్నాడు కుటుంబరావు.

"అంత మాటేంటి బాబుగారూ? నెలరోజుల్నించీ చిత్రవధచేస్తున్నాడు."

కుటుంబరావు, ఆమెవంక తేరిపార చూశాడు.

కటుంబరావు కాక్షణాన కలిగిన అనుభూతిని వొక్కమాటలో చెప్పటం కష్టం. సత్యవతిని అతను పరీక్షగా ఎన్నడూ చూడలేదు. ఆ అమ్మాయి



నల్లగా ఉంటుంది. కించిత్ పొట్టిగా ఉంటుందికూడా. కాని ఆ కళ్లు - బాధాశ్రితమైనప్పుడే అంతగా ప్రకాశిస్తోన్న ఆ కళ్ళు- ఆనందంతో ఉన్నప్పుడు...ఆమె

స్నిగ్ధ సౌందర్యరాశి కాదేమో, కాని ఆమెను, నగటు మగవాడు తప్పక ఆరాధిస్తాడు.

"అసలిదంతా ఎట్లా జరిగింది?

అంత బాధలోనూ ఆ అమ్మాయి కొంగ్గు పడ్డది. నెమ్మదిగా ఒక్కొక్కటే చెప్పుకొచ్చింది. జబ్బునుంచి తేరుకుని విశ్రాంతి తీసుకుంటూన్న రోజుల్లోనే శర్మ ఆమెను తరచూ కలుసుకోవటం ప్రారంభించాడుట. సత్యవతి కది మొదట్లో ఎబ్బెట్టుగాతోచలేదు. రాను రాను అతని మాటల్లో చేష్టల్లో అతని అభిప్రాయం తేటపడి ఆమె భయపడి పోయింది. ఆమెకి అంతవరకూ తన భర్త ప్రత్యక్షదైవం. ఇంత పెద్ద ఆసామీ తనమీద ఆశ పెట్టుకోవడం చూసి ఆమె మొదట చీదరించుకున్నది. ఐతే అతన్ని విదిలించి కొట్టలేక పోయింది. రాములుతో ఈ సంగతి చెప్పుకోలేకనూ పోయింది. చివరికి తను ఒక రోజున అదాటుగా వెనకనించి ఒచ్చి కౌగలించుకుంటే అతనికి లొంగి పోయింది. అధికారానికీ, సమాజంలో రామకృష్ణయ్యగారి కున్న పరపతికీ ఆమె లొంగిపోయింది. ఆ తర్వాత ఆ యిద్దరూ తరుచూ కలుసుకునేవారు. ఇదంతా రాములికిగానీ, మరొకంటి వాడికి గానీ తెలియకుండా యిద్దరూ జాగ్రత్త పడ్డారు.

ఆమె చెప్పిన కథ విని కుటుంబ రావు "ఈ గాథని అంతం చెయ్యటం చాలా తేలిక" అనుకున్నాడు. రాములు నోరు కట్టేయగలిగితే చాలు. సత్యవతికి భర్తమీద అనురాగం వీసమెత్తయినా తగ్గలేదు. శర్మని మరిచిపోవట మామెకి కష్టం కాదని ఆమెమాటల్లో తెలిసింది. కాని రాములు నోరు మూయించటానికి ఏం చెయ్యాలి?

అట్లా ఆలోచించడంతోనే కుటుంబ రావుకి రెండు మూడు రోజులు గడిచి పోయాయి. ఈ రెండు మూడు రోజుల్లోనూ రాములు అతనికి నాలుగైదు సార్లు కనిపించాడు. కుటుంబరావువంక కొరకొరా చూసేవా డతను. అతనికి వినపడేటట్లుగా ఎలికమీదా పిల్లిమీదా పెట్టి ఏదో మాటలు అనేవాడు. కుటుంబరావు కిది దుర్భరంగా తయారైంది. మరో రెండ్రోజులు గడిచిం తర్వాత ఉన్నట్టుండి శర్మ హటాత్తుగ ఊడిపడ్డాడు—భార్యా మామగార్లతో సహా.

మామూలుగా తనని పలకరించ టానికి వచ్చిన శర్మని చూసి మండి పడ్డాడు కుటుంబరావు. శర్మ అందుకు కించిత్తైనా చలించినట్టు కనపడలేదు. ఏదో పిచ్చాపాటీ మాట్లాడి వెళ్లిపో యాడు. ఆ సాయంత్రం అతనికోసం యింటికి వెళితే లక్ష్మీదేవిలాగా కళ కళ లాడుతూన్న అతని భార్య కని పించింది.



"ఆ అమ్మాయి కంఠహారం విరాళంగా యిచ్చివెళ్ళింది; ఆమె సంఘసేవికట!"
"అలానా! ఆ హారంకూడా రోల్డుగోల్డుదే!"

---

"ఇంట్లో లేరండీ" అన్న దామె కుటుంబరావును చూడంగానే.

"ఎక్కడికి వెళ్ళాడో కూడా చెప్ప లేదా?" అన్నాడు పక్కనే కూచున్న తండ్రి వెటకారంగా.

"అది నువ్వు కానియ్యి" అని లోపలి కెళ్ళిపోయిం దా అమ్మాయి.

ముసలాయన పంచాంగం విప్పాడు! "అది నాయనా వరస! జరుగుతున్న దంతా వెటకారంగా ఉంది దానికి. అబ్బాయి రాకముందు వరకూ ఆకాశరామన్న ఉత్తరాలన్నీ అబద్ధాలని దబాయించింది. అత నొచ్చి నిజమే నన్నాకే 'ఆయ నిష్టం,' అం టోంది. ఇంతటి ఘోరకలి ఎక్కడన్నా ఉందా?" అన్నాడు.

"ఇహ చాల్లే అపు" అని లోప ల్నుంచి కేక పెట్టిం దా అమ్మాయి.

ఆరోజు రాత్రి ఆ యింట్లో పంచా యితీ జరిగింది. కుటుంటరావు తండ్రీ, శర్మ మావఁగారూ శర్మకి ఎన్ని విధా లుగానో నచ్చ జెప్ప చూశారు. శర్మ యిసుమంతైనా చలించలేదు. "నా భార్యకిలేని అభ్యంతరం మీకెందుకు?" అన్నాడు. "తప్పో ఒప్పో ఆ అమ్మా యితో స్నేహం కలుపుకున్నాను. ఆ సంగతి ఎరిగిన మొగుడు యింక ఆమెతో కాపురం చేస్తా ననుకోవటం తెలివితక్కువ. ఆ అమ్మాయి ఏ నూతిలోనో దూకి చస్తే ఆ పాపం

ఎవరికి?'' అనడగాడు. రామకృష్ణయ్య గారు అంతా వింటూ మంచంలోనే ఉండిపోయాడు.

ఆ తర్వాత వారం రోజులు తిర క్కుండా రామకృష్ణయ్యగారు భార్య దగ్గరికి చేరుకున్నారు.

* * * *

"అదీ కథ" అన్నాడు కుటుంబ రావు.

బలహీనంగా ఉన్న చందమామ ఆకాశంలో నెమ్మదిగా పాకురుతు న్నాడు. చుక్కలు తెల్లబోతూ సిక్కి శిక్కి భయంగా చూస్తున్నాయి. సావిత్రీ రాజూ మౌనంగా ఒకర్నొకరు చూసుకున్నారు.

"బావుంది" అన్నది సావిత్రి చివరికి.

"ముందింకా బావుంటుంది."

పార్వతమ్మ గొంతు విని అరతా ఉలిక్కి పడ్డారు. ఆవిడ భర్త వైపు వెటకారంగా చూస్తూ "మిగతా కథ కూడా చెప్పండి" అన్నది.

కుటుంబరావు చిన్నగా నవ్వి "ఇంకా కథేం ఉంది పార్వతీ!" అన్నాడు.

"ఎందుకు లేదూ! ఆ దిక్కుమాలిన దాన్ని తెచ్చి ఆయనగారు మరోయింట కాపరం వెలిగించటమూ, దాని మూలాన పిల్లల్ని కనటమూ. దాని మొగుడు ఉరిపోసుకు చావటమూ, అదంతా లేదూ?"

"నిజమా నాన్నా? రాములు ఉరి పోసుకున్నాడా?" అన్నది పార్వతి.

కుటుంబరావు తలూపాడు. "తండ్రి పోయిన నెల రోజుల కల్లా కాపరాన్ని బెజవాడకి మార్చాడు శర్మ. అప్పటికే పరీక్ష లైపోయినై. సత్యవతిని కూడా పిలిపించి వేరే యింట్లో కాపరం పెట్టాడు" అన్నాడు.

"అందుకా యిల్లాలు ఒప్పుకుంది? అదీ చిత్రం" అన్నది పార్వతమ్మ బుగ్గలు నొక్కుకుంటూ..

"వొప్పుకోక ఏం చేస్తుందమ్మా?" అన్నది సావిత్రి కాస్త విసురుగా.

"అదేవిఁటే? ఎంత మానుషం చంపుకున్న అశక్తైనా సవతిపోరు కొని తెచ్చుకుంటుందిటే?"

"అందరికన్నా ఎక్కువగా ఆవిడ చెయ్యగలిగిందదే కావొచ్చునుగా?"

కుటుంబరావు ఎవరో నెత్తిమీద కొట్టినట్టుగా తల పైకెత్తాడు. ఆకా శంలో మేఘాలు తిరుగాడుతున్నై. చంద్రుడికి మేఘాలు అడ్డం వొచ్చిన చోట ఆకాశం నల్లగా. చీకటిగా కని పిస్తున్నది. ఆ నల్లటిచోటు బావుందా? దానివైపు ఎవరన్నా చూస్తారా? చూ.రు. చల్లని మెత్తటి చంద్ర కా.తిని వొదలి...కా..కాని తన! ఆనల్లటి నీ.లో ఏదో సొబగు కని పిస్తున్నది. అది తన లోపమా?

"కోరికలు పలువిధాలుగదా నాన్నా? అమ్మకి నిండుగా వుండటం యిష్టం. నీకు చీలినా ఫర్వాలేదు.''

కుటుంబరావు కూతురివంక ఒక్క క్షణం చూశాడు. జీవితాన్ని గురించి అతని కున్న సందేహాలన్నీ ఆక్షణాన పటాపంచలైపోయినట్లయింది. కూతురు బుజంమీద చెయ్యివేసి "పద భోంచేద్దాం'' అన్నాడు. ✱

